కాకాని చక్రపాణి

నవలలు/ నవలికలు

సంపుటం–7

# మహానగరంలో మాఫియా

(రిక్రూట్‌మెంట్)

ఎమెస్కో

# మహానగరంలో మాఫియా

(రిక్రూట్‌మెంట్)

## 1

"నాకో పని చేసి పెడతావా?"

భద్రం విసుగ్గా చూచాడు. చలికాలమయినా ఎండ చురుక్కుమంటోంది. మధ్యాహ్నం ఒంటి గంటయింది. ఆకలవుతోంది. హోటల్‌కు వెళ్ళటానికి కావాల్సినంత డబ్బు జేబులో లేదు. నెల రోజులయింది తను పనిలోకి వెళ్ళి. కంపెనీ మూసేశారు. యూనియన్ మీటింగ్‌కు వెళ్ళాడు. కార్మికనాయకులు ఉపన్యాసమిచ్చారు. "మళ్ళీ కంపెనీ తెరుస్తారు. మీ నౌకరీ ఎక్కడికీ పోదు. కార్మిక శక్తి అజేయం. మీ వెనుక మేం ఉన్నాం. మా ప్రాణాలొడ్డి పోరాడతాం" అని అలవాటుగా వాళ్ళు చెప్పేమాటలు చెప్పారు. భద్రానికి మాత్రం అనిపించలేదు– వాళ్ళు కంపెనీ తెరుస్తారని, వాళ్ళు ఎప్పటినుండో ప్రైవేటీకరణ దిశగా ఒక్కొక్క వింగూ మూసుకు వస్తున్నారు. ఇప్పుడు పూర్తిగా మూసేశారు. ప్రావిడెంట్ ఫండ్ లోన్ ఇప్పిస్తామంటున్నారు నాయకులు. కాయితాలమీద సంతకాలు పెట్టించుకున్నారు. స్ట్రగుల్ ఫండన్నారు. ఖర్చులంటున్నారు. ఒక్కొక్కరి దగ్గరా రెండు వందలు వసూలు చేశారు. ఇంత వరకూ ప్రావిడెంట్ ఫండ్ లోను రాలేదు. ఎప్పుడు వస్తుందో ఏమో! నెల జీతం వస్తేనే అంతంత మాత్రంగా గడిచే బ్రతుకు ఇప్పుడు దుర్భరమై పోయింది. సనత్‌నగర్‌నుంచి కాళ్ళీడ్చుకుంటూ అమీర్‌పేటదాకా వచ్చాడు. అక్కడ ఓ పాన్ డబ్బా ముందు నిలబడి, జేబులో వున్న చిల్లర డబ్బులతో సిగరెట్టు కొని, అంటించబోతుంటే అతడికీ ప్రశ్న వినిపించింది.

"ఏం కావాలి?" అన్నాడు భద్రం విసురుగా.

"ఎందుకంత కోపం? మాట్లాడుకున్నాక... నీకిష్టమైతేనే చెయ్యి."

అతడి వంక సాలోచనగా చూచాడు భద్రం. మనిషి సన్నగా, పొడుగ్గా వున్నాడు. కొద్దిగా పళ్ళెత్తు. అందువల్ల నవ్వకపోయినా నవ్వినట్లు కన్పించే ముఖం. పక్కపాపిడి. ఆ కళ్ళల్లో ఏదో ఆకర్షణ వుంది. పైజమా, లాల్చీ. మనిషి చాలా సాదా సీదాగా వున్నాడు... నలభై యాభైల మధ్య వయస్సు.

"నీ పని చేస్తే నాకేం ప్రయోజనం?"

"అడగాల్సిన మాట అడిగావు. పద, అక్కడ చెట్టు క్రింద నిలబడి మాట్లాడుకుందాం."

భద్రం విసుగ్గా అతడితోపాటు చెట్టు నీడకు నడిచాడు.

"ఏంవిటో చెప్పు!"

"ఏం లేదు... ఆ ఇంటి ముందుకు ఓ కారు వస్తుంది. ఇదుగో నంబరు. ఈ కాగితంలో రాశాను. తెల్ల మారుతీ ఎస్టీం కారు. అది ఆ ఇంటికి ఎప్పుడు, ఎన్నిసార్లు వస్తుందో కనిపెట్టి నాకు చెప్పాలి. వారం రోజుల పని. ఏమివ్వమంటావో చెప్పు."

అతనిచ్చిన కాగితం తీసుకుంటూ, "ఆ కారు ఎన్ని సార్లు ఆ యింటికి వస్తే నీకేం?" అన్నాడు భద్రం.

"అలా ప్రశ్నలు వేయకూడదు... నీకిష్టమైతేనే చెప్పు."

"ఎంతిస్తావ్?"

"వారానికి ఐదొందలు!"

"కుదరదు!"

"ఎంత కావాలి?"

"వెయ్యి రూపాయలివ్వు."

"ఆ కాస్త పనికే వెయ్యా?"

"ఆ కారు ఆ ఇంటికెప్పుడొస్తుందో ఎలా తెలుస్తుంది? పొద్దున పదిగంటలనుండి రాత్రి పదిగంటల దాకా నయినా వుండాలి కదా!"

"ఉండాలి... మరే కార్లు వస్తాయోకూడా కనిపెట్టాలి. ఏం జరుగుతూ వుందో కూడా జాగ్రత్తగా గమనించాలి!"

"మరింకేం? తక్కువే అడిగాను."

"సరే, అడ్వాన్సు ఏమన్నా కావాలా?"

"మొత్తం ఇచ్చెయ్యి."

"అలా కుదరదు. ముందు సగమిస్తాను. పనయ్యాక మిగతాది."

"నువ్వు ఎప్పుడూ ఇక్కడ వుండవుగదా... నువ్వు చెప్పిన పని నేను చేయకపోతే?"

"అది నీకే నష్టం. నాకెప్పుడూ పనులుంటాయి. నా పని సరిగా చేసిపెట్టేవాడికే ఇచ్చుకుంటాను."

"సరే."

"రేప్పొద్దున వస్తాను ఇక్కడకి. నువ్వేం గమనించావో చెప్పాలి!" అని జేబులోనుండి ఐదు వంద నోట్లు తీసి భద్రానికిచ్చి అతడు వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోతుంటే వింతగా అతని వంక చూచాడు భద్రం. అతను పక్కవీథిలోకి తిరిగాక కానీ, భద్రానికి గుర్తురాలేదు– తను అతడి పేరు గూడా తెలుసుకోలేదని.

భద్రం జేబు తడిమి చూసుకున్నాడు. డబ్బు జేబులో భద్రంగానే ఉంది. ఇక అతను ఆ ఆగంతకుడి విషయం మరిచిపోయాడు. వెంటనే ఓ ఫర్లాంగు దూరం నడిచి, అక్కడున్న హోటల్లో సుష్ఠుగా భోజనం చేశాడు. భోజనమయ్యాక బద్ధకమనిపించింది. కానీ, డ్యూటీ చెయ్యక తప్పదు. కంపెనీలో అయితే పని చేసినా, చెయ్యకపోయినా గడిచిపోయేది. గట్టిగా అడిగే దమ్ముకూడా సూపర్‌వైజర్లకు వుండేది కాదు. కాని, ఇక్కడలా కుదరదు. తన కడుపు నిండాలీ అంటే వచ్చిన అవకాశాన్ని చేజార్చుకోగూడదు.

రెండు గంటలకు డ్యూటీలో చేరాడు భద్రం. సిగరెట్టు బడ్డీ దగ్గర నిలబడి మరో సిగరెట్టు కొనుక్కొని అంటించాడు. ఆపైన ఆ ఆగంతకుడు చెప్పిన ఇంటి వైపుగా చూడసాగాడు. రెండంతస్తుల పెద్ద ఇల్లు. ముందు పెద్ద కాంపౌండ్. కాంపౌండ్‌లో చిన్న గార్డెన్ పెంచారు. అక్కడా మనుష్యుల అలికిడి లేదు. 'డబ్బున్నోళ్ళు ఎక్కడో తొంగుంటారు. తనలాగా బయటకొచ్చేపని వాళ్ళకెందుకుంటుంది?' అనుకున్నాడు. ఇంక అతనికి ఆ బిల్డింగ్ పట్ల ఆసక్తి నశించింది. మనిషి మనసు కోతిలాంటిది. అది ఓ చెట్టు కొమ్మనుండి మరో కొమ్మకు, మరో చెట్టుకు గెంతినట్టు ఆలోచన్లు చేస్తూ వుంటుంది.

'ఎందుకతను తనకాపని అప్పజెప్పాడు? ఇందులో ఏదో రహస్యమున్నట్టుంది. ఇందులో నేరానికి సంబంధమేమైనా ఉందా? తనిలా ఆ ఇంటికి కాపలా కాస్తూ, అతనిక్కావాల్సిన సమాచారం అందించినందువల్ల తనే పోలీసు కేసులోనైనా ఇరుక్కుంటాడా? పోలీసులతో మహా తంటా! ఏం లేకపోయినా ఏదో తప్పుడు కేసు బనాయించి సతాయిస్తారు. ఒకసారి తనకా అనుభవమైంది...' పాత జీవితం నెమరు వేసుకోసాగాడు భద్రం.

'ఫ్యాక్టరీలో ఐరన్ రాడ్స్ మాయమవుతుండేవి. అధికారుల దృష్టికది రాలేదు. స్టోర్ కీపర్ గోల పెట్టాడు. ఏదో రొటీన్ వ్యవహారమన్నట్లు విచారణ చేశారు కానీ, పెద్దగా పట్టించుకోలేదు. రంగా ఆ పని చేసేవాడు. ఒక్కడే ఆ పని నిర్వహించలేక తన్ను జట్టులోకి చేర్చుకున్నాడు. డబ్బంటే ఎవడికయినా ఆశే. తాము నెలకు రెండు, మూడు సార్లు మాత్రమే ఆ పని చేసేవాళ్ళు. సెక్యూరిటీకి తెలియకుండా చెయ్యటం కష్టమయేది. అలవాటు పడ్డ